క్లుప్తంగా

ఎమ్మెల్యే సత్యంకు పరామర్శ

నారాయణఖేడ్: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కాంగ్రెస్ నాయకులు సోమవారం పరామర్శించారు. ఎమ్మెల్యే సతీమణి రూపాదేవి ఇటీవల ఆత్మహత్య చేసుకున్న నేపథ్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్, సత్యం సన్నిహితులైన న్యాయవాది సంగన్నతో పాటు నాయకులు నర్సింహారెడ్డి, జ్ఞానేశ్వర్, గుండు పటేల్ తదితరులు హైదరాబాద్‌కు వెళ్లి ఎమ్మెల్యే సత్యంను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూపాదేవి మృతి బాధాకరమన్నారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రీడింగ్ స్కిల్స్ పెంచాలి

నారాయణఖేడ్: విద్యార్థుల్లో రీడింగ్ స్కిల్స్ పెంచేవిధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జెడ్పీటీసీ లక్ష్మీబాయి అన్నారు. మండల పరిధిలోని జూకల్ శివారులో ఉన్న మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా బోధన తీరు, ఆహార నాణ్యత, తదితర అంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీను, ఏటీపీ శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలకు వ్యాక్సినేషన్

పటాన్‌చెరు టౌన్: పట్టణ పరిధిలోని ఇస్నాపూర్‌లో 54 వీధికుక్కలకు మండల పశు వైద్యాధికారి శైలేంద్ర జస్వాల్ ఆధ్వర్యంలో సోమవారం యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీధికుక్కలు ఎక్కువగా సంచరిస్తున్న గ్రామాల్లో వ్యాక్సినేషన్ వేస్తామని తెలిపారు. వీధికుక్కలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, పశువైద్య సిబ్బంది పద్మ, సులోచన తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులు చేపట్టాలి

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల కేంద్రం మీదుగా గ్రామాలకు వెళ్లే పంచాయత్ రాజ్ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాణిక్‌రావు మాట్లాడుతూ.. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు దర్జీ సుధాకర్, శ్రీనివాస్, నాయకులు లక్ష్మణ్, మోహన్‌రెడ్డి, శ్రీశైలం, శేఖర్, అంబదాస్, శ్రీకాంత్, భరత్, అశోక్, సుభాష్, మొగులయ్య, ప్రశాంత్, అనిల్, రమేష్ పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి కృషి



పనులు ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ కుమార్‌గౌడ్

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని అన్ని గ్రామాలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు గుమ్మడిదల జెడ్పీటీసీ కుమార్‌గౌడ్ అన్నారు. గుమ్మడిదల గ్రామంలోని కురుమ బస్తీలో రూ.6లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. అనంతరం కుమార్‌గౌడ్ మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు నిర్మించేవిధంగా దశలవారీగా నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నోటీసులు అందజేత

నారాయణఖేడ్: దుకాణాలు, వ్యాపార సంస్థల వ్యర్థాలను ఇష్టానుసారంగా రోడ్లపై వేయకూడదని సూచిస్తూ మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్ సోమవారం వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూరగాయల దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థల నుంచి వెలువడే వ్యర్థాలను రహదారులపై వేయకుండా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చెత్త సేకరణ వాహనంలోనే వేయాలని సూచించారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్ దారం శంకర్, కమిషనర్ జగ్జీవన్ ఆదేశాల మేరకు నోటీసులు ఇచ్చినట్లు పేర్కొన్నారు.

సంతకాల సేకరణ

జహీరాబాద్ టౌన్: పట్టణంలో 50 పడకల ఈఎస్ఐ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం సంతకాల సేకరణ చేపట్టారు. పట్టణ సమీపంలోని మహీంద్ర అండ్ మహీంద్ర కర్మాగారం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి కార్మికులు పెద్ద సంఖ్యలో వచ్చి సంతకాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, నాయకులు సూరి, నరేష్, బాల్‌రాజ్, మహేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జహీరాబాద్ ప్రాంతంలో మొక్కలు నాటే పనులకు అధికారులు శ్రీకారం చుట్టారు. వర్షాలు కురుస్తుండటంతో గ్రామాలు, రోడ్డు పక్కన ఖాళీ ప్రదేశాల్లో మొక్కలను నాటేందుకు ఉపాధిహామీ కూలీలతో అవసరమైన గుంతలను తవ్విస్తున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది టార్గెట్ తగ్గించడంతో నర్సరీల్లో మొక్కల పెంపకం సంఖ్య భారీగా తగ్గింది.

– జహీరాబాద్ టౌన్



హోతి(బి) నర్సరీలో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు

టార్గెట్ తగ్గింది!

గతేడాదితో పోల్చితే ఈ ఏడాది భారీగా తగ్గిన మొక్కల పెంపకం

పూర్తయిన గుంతలు తీసే పనులు ● నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల పరిధిలో 22 చొప్పున 44 గ్రామ పంచాయతీలు ఉండగా ఆయా పంచాయతీ పరిధిలలో నర్సరీలను ఏర్పాటు చేసి మొక్కల పెంపకానికి శ్రీకారం చుట్టారు. గతేడాది ఒక్కో మండలంలో 3.50లక్షల మొక్కల పెంపకం టార్గెట్ ఉండగా ఈ ఏడాది 1.32లక్షలు తగ్గించారు. మొక్కలు నాటేందుకు గుంతల సంఖ్య కూడా తగ్గించారు. గతేడాది 23లక్షల గుంతలను తవ్వగా ఈ ఏడాది జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో 60 వేలు చొప్పున 1.20 లక్షల గుంతలను మాత్రమే తవ్వించారు. గత ప్రభుత్వ హయాంలో అధికసంఖ్యలో మొక్కలను నాటగా ఈ ఏడాది ఒక్కో గ్రామంలో 2700 మొక్కలు మాత్రమే నాటాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు ఉపాధిహామీ కూలీలతో గుంతలను తవ్వించి మొక్కలు నాటుతున్నారు. నర్సరీల్లో కానుగ, గుల్‌మోహర్, వేప, చింత, గన్నేరు, మేంది, జామ, మునుగ, మామిడి, కరివేపాకు తదితర రకాల మొక్కలను పెంచగా నాటేందుకు సిద్ధంగా ఉంచారు.



మల్‌చెల్మ గ్రామంలో తవ్విన గుంతలు

పూర్తయిన ఎవెన్యూ ప్లాంటేషన్ పనులు

జహీరాబాద్, మొగుడంపల్లి మండలాల్లో రహదారుల పక్కన మొక్కలు నాటేందుకు గుంతల పనులను (ఎవెన్యూ ప్లాంటేషన్) పూర్తయ్యాయి. గతేడాది నుంచి ఇప్పటివరకు 36 కిలోమీటర్ల వరకు రోడ్లకు ఇరువైపులా మొక్కలను నాటారు. ఈ ఏడాది ప్రభుత్వ భూములు, రైతుల పొలాల్లో ఉపాధిహామీ పథకంలో భాగంగా మొక్కలు నాటేందుకు శ్రీకారం చుట్టారు. మొక్కల పరిరక్షణ కోసం ట్రీగార్డు, స్టిక్‌లు సిద్ధం చేశారు.

మొక్కలను ఉచితంగా ఇస్తాం



వర్షాలు కురవడంతో మొక్కలు నాటే పనులను ప్రారంభించాం. జహీరాబాద్ మండలంలో ఎవెన్యూ ప్లాంటేషన్ పనులు పూర్తయ్యాయి. నర్సరీలో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. ఇళ్ల వద్ద మొక్కలను పెంచుకోవడానికి ఉచితంగా ఇస్తాం. అవసరమైన వారు సంప్రదించాలి. అన్నిరకాల మొక్కలు అందుబాటులో ఉన్నాయి. గతేడాది కంటే ఈ ఏడాది ప్లాంటేషన్ టార్గెట్ తక్కువగా ఉంది.

– అశోక్‌కుమార్, ఏపీఓ, జహీరాబాద్

అర్హులకే 'రైతు భరోసా'

నారాయణఖేడ్: అర్హులైన రైతులకు మాత్రమే రైతు భరోసా పథకాన్ని వర్తింపజేయాలనేది ప్రభుత్వ ఉద్దేశమని జిల్లా సహకార అధికారి ప్రసాద్ అన్నారు. రైతు బరోసా పథకంపై పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో సోమవారం రైతుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీ తరువాత రైతుల నుంచి సేకరించిన వివరాలను ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. 10 ఎకరాలలోపు వరకు సాగుచేసే భూములకు సంబంధించే రైతు భరోసా నిధులు ఇవ్వాలని, లేఅవుట్లు, రహదారులకు ఇవ్వరాదని రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సహకార సహాయ రిజిస్ట్రార్ చిన్నా, పీఏసీఎస్ చైర్మన్ శోభారాణి, ఏఈఓ రాందాస్, శేషగిరిరావు, పీఏసీఎస్ పాలవర్గం, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి ప్రసాద్

రైతుభరోసా పథకంపై అభిప్రాయ సేకరణ

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో చైర్మన్ మారుతిరెడ్డి అధ్యక్షతన రైతుభరోసా పథకంపై సోమవారం అభిప్రాయ సేకరణ చేపట్టారు. సమావేశానికి ముఖ్య అతిథిగా డీసీఓ తుమ్మ ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రాళ్లురప్పలతో కూడిన భూములు అధికంగా ఉండటంతో పెట్టుబడి వ్యయం ఎక్కువ, దిగుబడి తక్కువ అవుతుందని, పంటలు సాగు చేసేవారికి మాత్రమే రైతు భరోసా ఇవ్వాలని చాలామంది రైతులు తమ అభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ చిన్నారావు, సీనియర్ అసిస్టెంట్ శేషగిరిరావు, జూనియర్ అసిస్టెంట్ అరుణ్, సిబ్బంది అడివప్ప, నాగిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



కంగ్టి సొసైటీ కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న అధికారులు



● అ'పూర్వ' సమ్మేళనం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని వావిలాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995–96 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు సోమవారం పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ప్రతి నెల రూ.500 సేకరించి తోటి స్నేహితులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే సాయం చేయాలని నిర్ణయించారు. అనంతరం అప్పట్లో పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.

అంగన్‌వాడీ టీచర్లకు పెండింగ్ వేతనాలివ్వాలి

జహీరాబాద్ టౌన్: పెండింగ్ వేతనం చెల్లించాలని అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు సోమవారం సీడీపీఓకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ నాయకులు షాహెదా బేగం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ మే నెల జీతాలు ఇంత వరకు ఇవ్వకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతుందన్నారు. ప్రతీ నెల 1వ తేదీన జీతాలు ఇవ్వాలని కోరారు.

ఈ క్వారీలు మాకొద్దు

జిన్నారం(పటాన్‌చెరు): క్వారీల ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దని జిన్నారం మండలం మాదారం గ్రామస్తులు తేల్చి చెప్పారు. సోమవారం గ్రామంలో అన్ని పార్టీల నాయకులు, ప్రజలు కలిసి సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మాజీ సర్పంచ్ సురేందరగౌడ్, నాయకులు రాజు గౌడ్ తదితరులు మాట్లాడారు. మాదారం గ్రామ పరిధిలో వంద ఎకరాల్లో కొత్తగా క్వారీ ఏర్పాటు చేసేందుకు కొందరు యత్నిస్తున్నారన్నారు. ఉన్నవాటితో ఇబ్బంది పడుతున్నామని, కొత్తవి వస్తే గ్రామంలో నివసించడం కష్టమన్నారు. గ్రామపరిధిలో క్వారీల ఏర్పాటును తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. లీజ్ గడువు ముగిసినా రెండు క్వారీలు కొనసాగుతున్నాయని, ఈ విషయమై పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడుతామన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు 18 మందికి జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం... శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 20 మందిని అదుపులోకి తీసుకుని సోమవారం కోర్టులో హాజరుపర్చగా జడ్జి 18మందికి ఒక్కొక్కరికి రూ.2 వేలు చొప్పున జరిమానా విధించగా మరో ఇద్దరికి జరిమానాతో పాటు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు పేర్కొన్నారు.

మొక్కల సంరక్షణ.. అందరి బాధ్యత

● పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి
● ఎమ్మెల్యే సునీతారెడ్డి

హత్నూర(సంగారెడ్డి): మొక్కల సంరక్షణ.. అందరి బాధ్యత అని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా సోమవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని ప్రతిఒక్కరూ మొక్కలను నాటాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ కళాశాలకు ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని కోరుతూ ఎమ్మెల్యేకు కళాశాల తరఫున వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింలు, ఎంపీడీవో శంకర్ ఎంపీఈఓ సువర్ణ, ఏపీవో ప్రవీణ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేష్‌కుమార్, ఎంపీటీసీ వీరేశం, మాజీ జెడ్పీటీసీ ఆశయ్య, నాయకులు రవికుమార్, నర్సింహారెడ్డి, శివశంకర్ రావు, రాంచంద్రారెడ్డి, శ్రీకాంత్, రమేష్, మధు, కిషోర్, సురేష్, సురేందర్‌రెడ్డి, వీరేందర్, ఎండీ అజ్జు, పోచ్చయ్య పాల్గొన్నారు.



మొక్కకు నీరు పోస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

రామచంద్రాపురం డివిజన్ పరిధిలో...

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కార్పొరేటర్ పుష్ప అన్నారు. డివిజన్ పరిధిలోని ఆర్‌ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్ పరిసర ప్రాంతాల్లో సోమవారం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన సొంత ఖర్చులతో మొక్కలను కొనుగోలు చేసి నాటినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న కార్పొరేటర్ పుష్ప

అందరూ మొక్కలు నాటాలి

కంది(సంగారెడ్డి): వనమహోత్సవంలో భాగంగా ప్రతీఒక్కరు మొక్కలు నాటాలని ఎంపీఓ మహేందర్ రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని మామిడిపల్లిలో మొక్కలు నాటి వన మహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది గ్రామానికి 2700 మొక్కలను నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ స్వామి, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ల తోపాటు ఉపాధి కూలీలు పాల్గొన్నారు.



మొక్కకు నీరు పోస్తున్న ఎంపీఓ మహేందర్‌రెడ్డి

'వైద్య వృత్తి దైవంతో సమానం'



డాక్టర్ కృష్ణమూర్తిని సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు



డాక్టర్ విఠల్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెంకట్‌రాములు



వైద్య సిబ్బందిని సన్మానిస్తున్న నాయకులు



డాక్టర్లను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కల్హేర్(నారాయణఖేడ్): వైద్య వృత్తి దైవంతో సమానమని సీనియర్ న్యాయవాది, డీసీసీబీ డైరెక్టర్ గుండు వెంకట్‌రాములు అన్నారు. డాక్టర్ డేను పురస్కరించుకొని నారాయణఖేడ్ ప్రాంతానికి చెందిన రిటైర్డ్ డాక్టర్ విఠల్‌ను జిల్లా కోర్టు న్యాయవాదుల తరపున సోమవారం ఘనంగా సన్మానించారు. న్యాయవాదులు నారాయణ, చంద్రయ్యస్వామి తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో...

వట్‌పల్లి(అందోల్): ప్రపంచ వైద్యుల దినోత్సవం సందర్భంగా సోమవారం వట్‌పల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో హోప్ న్యూరో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణమూర్తితో పాటు పలువురు డాక్టర్లను ఘనంగా సన్మానించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మైనోద్దీన్, క్లబ్ కార్యదర్శి కిషన్‌రావు, చార్టెడ్ ప్రెసిడెంట్ వైద్యసాగర్, సభ్యులు మధు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైద్యసిబ్బందికి సన్మానం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలోని వైద్య సిబ్బందిని డాక్టర్స్ డే సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు షేక్ అబ్దుల్ గఫార్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వర్తక సంఘం ప్రతినిధులు జ్ఞానేశ్వరి, మొహినుద్దీన్, ప్రభాకర్, సాబేర్, రమేష్, రాజు పాల్గొన్నారు.

జోగిపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో...

జోగిపేట(అందోల్): డాక్టర్స్ డే సందర్భంగా జోగిపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్, శంకర్ బాబు, శివశంకర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, సిద్దార్థ, భారతి, అనూష, వీణ, సౌజన్య, నాగలక్ష్మి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్, డాక్టర్లు అనంతరెడ్డి, జగదీశ్వర్, జోగిపేట మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వైస్‌చైర్మన్ ప్రవీణ్, మధుసూదన్‌రెడ్డి, సంతోష్‌కుమార్, రామకృష్ణ, రవి శేఖర్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, కృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, వర్మ, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

షుగర్ పరీక్ష కేంద్రం ప్రారంభం

డీఎస్‌రెడ్డి ఆస్పత్రి ఆవరణలో పర్మినెంట్ ఉచిత షుగర్ పరీక్ష కేంద్రాన్ని లయన్స్ క్లబ్ ప్రోగ్రాం చైర్మన్ డాక్టర్ అనంతరెడ్డి ప్రారంభించారు. ప్రతి శనివారం ఉదయం 8 గంటల నుంచి 1 గంట వరకు ఉచిత పరీక్షలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

14 మంది ఉపాధ్యాయులు రిలీవ్

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పని చేస్తున్న 100 మందికి పైగా ఎస్‌జీటీ ఉపాధ్యాయులు వివిధ పాఠశాలలకు బదిలీ అయ్యారు. వంద మందికి పైగా ఉపాధ్యాయులు బదిలీ కాగా అందులో సోమవారం సాయంత్రం వరకు 14 మంది రిలీవ్ అయినట్లు ఎంఈఓ తెలిపారు. బదిలీ అయిన వారిస్థానంలో ఒక్కరూ కూడా చేరలేదు.

సంక్షిప్త వార్తలు

◆ **సైన్స్ ల్యాబ్ పరికరాల పంపిణీ**

నారాయణఖేడ్: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిధిలోని సంజీవన్‌రావుపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలకు సైన్స్ పరికరాల కోసం జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.లక్ష చొప్పున మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ల్యాబ్‌లకు అవసరమైన పరికరాలను కొనుగోలు చేయగా సోమవారం ఖేడ్ జెడ్పీటీసీ లక్ష్మిబాయి ఆయా పాఠశాలలకు వెళ్లి పరికరాలను పంపిణీ చేశారు. ఆమె వెంట ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యులు రవీందర్‌నాయక్, ఖేడ్ నియోజకవర్గ కురుమ సంఘం ఉపాధ్యక్షుడు మల్గొండ ఉన్నారు.

◆ **చికిత్స పొందుతూ కార్మికుడు మృతి**

హత్నూర(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన కాంట్రాక్టు కార్మికుడు చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలం పరిధిలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన లింగాపురం శ్రీకాంత్(23) తురకల ఖానాపూర్ శివారులోని ఎస్సీఎల్ పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శ్రీకాంత్ ఆదివారం మధ్యాహ్నం విధులకు వెళ్లి సాయంత్రం ఇంటికి బైక్‌పై వస్తుండగా ఎదురుగావస్తున్న కారు ఒకసారిగా బైకు ఢీకొనడంతో శ్రీకాంత్కు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబీకులు ఫసల్వాది సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

◆ **డిమాండ్లను నెరవేర్చాలని నిరసన**

జహీరాబాద్: తమ డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ ఎల్ఐసీ ఉద్యోగులు భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ ప్రధాన కార్యదర్శి అశోక్ మాట్లాడుతూ ఎల్ఐసీలో ఉన్న క్లాస్ 3,4 ఉద్యోగ నియామకాలను చేపట్టాలన్నారు. పాత పెన్షన్ విధానం కొనసాగించాలని, లేబర్ కోడ్‌ను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు జమున, నర్సింలు,శ్రీహరి, మాణయ్య, రాజశేఖర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ **లక్ష్యంతో ముందుకు సాగాలి**

జిన్నారం(పటాన్‌చెరు): విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని ఎంపీపీ రవీందర్‌గౌడ్ సూచించారు. హెటిరో పరిశ్రమ సహకారంతో జిన్నారంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బ్యాగులు, నోటుబుక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లావణ్య, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

◆ **డిజిటల్ తరగతులు ప్రారంభం**

ఝరాసంగం(జహీరాబాద్): ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ తరగతులు ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాజెక్టర్ ద్వారా సోమవారం తరగతులను ప్రారంభించారు. కార్యక్రమంలో సీఆర్పి రాజు, ఉపాధ్యాయులు విఠల్, బాల్‌రెడ్డి, చాంద్ పాషా, ఇందిరా రమాదేవి, మంజు, వాణి తదితరులు పాల్గొన్నారు.

◆ **సికిల్ సెల్ అనీమియాపై అవగాహన**



ఝరాసంగం(జహీరాబాద్): ప్రపంచ సికిల్ సెల్ అనీమియా దినోత్సవ సందర్భంగా గిరిజన ప్రాంత ప్రజలకు సికిల్ సెల్ అనిమియాపై మండల పరిధిలోని బోజ్యా నాయక్ తండాలో సోమవారం అవగాహన కల్పించారు. ఎంపీడీఓ సుధాకర్, ఉపాధి హామీ ఏపీఓ రాజ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి మహేష్, సీహెచ్ఓ సుదర్శన్, ఏఎన్ఎం అనిత, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ **గర్భగుడి నిర్మాణ పనులు ప్రారంభం**

జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న జ్యోతిర్లింగ శివాలయ గర్భగుడి పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. దేవాలయ నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని దేవాలయ నిర్మాణ సమన్వయ కమిటీ సభ్యులు సూచించారు.

◆ **ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన**

సంగారెడ్డి టౌన్: విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని సంగారెడ్డి మండలంలోని ఎమ్మెన్నార్ కళాశాల ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. కళాశాల యాజమాన్యం విద్యార్థులకు హాస్టల్లో నాణ్యమైన భోజనం అందించాలని గత వారం ఆందోళన చేయగా పోలీసులతో బయటకు పంపించారు. కళాశాల యాజమాన్యం ఇప్పటికి స్పందించకపోవడంతో ఏబీవీపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

ఏబీవీపీ నాయకులపై కేసు నమోదు

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండంలోని ఎమ్మెన్నార్ యూనివర్సిటీలో ఏబీవీపీ నాయకులు విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని యూనివర్సిటీలోని అద్దాలు, ఫర్నిచర్ ధ్వంసం చేశారు. దీంతో కళాశాల యాజమాన్యం ఫిర్యాదు మేరకు 26మంది పైన కేసులు నమోదు చేసినట్టు సంగారెడ్డి రూరల్ ఎస్ఐ వినయ్‌కుమార్ తెలిపారు.

◆ **కళాకారులను ఆదుకోవాలి**

పటాన్‌చెరు: కళాకారులను అన్ని రకాలుగా ఆదుకోవాలని జిల్లా కార్యదర్శి నాగభూషణం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని శ్రామిక భవన్‌లో ప్రజానాట్య మండలి (పీఎన్ఎం) మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాకారులకు ఉద్యోగ అవకాశాలు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. అనంతరం ప్రజానాట్య మండలి మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజు, కార్యదర్శిగా దౌలప్పా, కమిటీ సభ్యులుగా కృష్ణ, గోపాల్, ప్రసాద్, ప్రకాష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

◆ **మహిళ అదృశ్యం**

జిన్నారం(పటాన్‌చెరు): మహిళ అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని సోలక్‌పల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ విజయారావు తెలిపిన వివరాల ప్రకారం... సోలక్‌పల్లి గ్రామానికి చెందిన దుంటి బాబు సంగారెడ్డిలో నివాసం ఉంటున్న మహేశ్వరిని ఐదు నెలల క్రితం ప్రేమించి వివాహం చేసుకున్నాడు. అయితే గత నెల 23న సంగారెడ్డికి వెళ్లిన మహేశ్వరి తిరిగి ఇంటికి రాలేదు. మహేశ్వరి కోసం ఎంతవెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మహేశ్వరి భర్త బాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

◆ **జోనల్ మేనేజర్‌గా రతన్ రాథోడ్**

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ అనురాధ జీడిమెట్ల జోన్‌కు బదిలీ అవ్వగా ఆమె స్థానంలో రతన్ రాథోడ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రతన్ రాథోడ్ టీఎస్ఐఐసీ ప్రధాన కార్యాలయం నుంచి పటాన్‌చెరు జోన్‌కు బదిలీపై వచ్చారు.